# చదువు'కొందాం'రండి

అంతా చదువుకోవాలి. దేశానికి మేధావుల అవసరం ఎంతోఉంది. మన వాడి తెలివి పద్దులూ, బేరాలు, నీతిపద్యాలూ వీటికే పరిమితం కాకూడదు. సైంటిస్టవ్వాలి. ప్రెసిడెంట్ ఆఫ్ ఇండియా అవ్వాలి. నైటింగేలవ్వాలి అనుకుంటున్నామా లేదా! ఎంత మాట గుండా చెరువా!? మనకున్న శారీరక మానసిక శక్తులన్నీ ఇంకెవరి కోసం ధారపోస్తాం పిల్లల కోసం కాకపోతే

మరెందుకీ అదురు, కళ్ళమ్మడి భయం, బెదురు అంతా అడగండి బావుంది.

మునిసిపల్ గవర్నమెంట్ బళ్ళన్నీ చవకరకం నేత చీరల్లా వెలిసిపోయాయిప్పుడు. పిల్లలు చదవట్లేదంటారు పంతుళ్ళు. మాష్టర్లే రావటం లేదంటారు పిల్లలు. రెండు పిల్లుల రొట్టె ముక్కల తగాదా కాస్తా కోతి తీర్చేసినట్టు కాన్వెంట్లొచ్చాయి. కిలో ఇంత చొప్పున పచారీ కొట్లో చింతపండో కందిపప్పో అమ్మినట్టు చదువు అమ్మకానికొచ్చింది. తప్పేంలేదు. పెళ్ళాం పిల్లల్తో సహా టీచర్లు బతకాలా! బడి పెట్టిన వాడు బావుండాలా వద్దా అనుకుందాం. కచ కచా ఆంగ్లంలో గొలెట్టుకుంటూ వచ్చిన కాన్వెంట్లుకాస్తా మెల్లిగా నెత్తిన కాళ్ళేట్టేశాయి. ఏదయినా సరే వీళ్ళకి గుండు గీసి సున్నబొట్లు పెట్టాలని సరదాగా కూడబలుక్కున్నాయి.

'విద్యలేని వాడు వింత పశువని' చిన్నప్పుడు వీధి బళ్ళో చదువుకున్నాం 'చదువుకున్న వాడి కంటే రజకుడు మేలని' అదే సామెతని ఝూడించి ఎండేశారు కొందరు.

ఏది ఏమయినా అమ్మని 'మమ్మీ' చేస్తున్న యూనిఫారానికీ బూట్లకీ మనసిచ్చేసి మంత్రించినట్టయిపోయాం. వాట్ ఈజ్ నాన్న అంటే వెర్రానందంలో మునిగిపోతున్నాం. సరే వెనక్కి తిరగద్దు విషయానికొద్దాం.

పిల్లనీ, పిల్లవాణ్నీ కాన్వెంట్లో వేసిన పేరెంటు గాళ్ళెవరూ తిరుపతి వెళ్ళాల్సిన పన్లేదు. ఈ 'ట్వింకిల్ ట్వింకిల్ లిటిల్ స్టార్ల'తోటే కళ్ళు బైర్లు కమ్ముతుంటే రేపు హైస్కూళ్ళనీ, కాలేజీ సీట్లనీ, పుస్తకాలనీ తట్టుకోడమెలాగో అర్థం కావడంలేదు. భారతదేశంలో చదువుకోడమొక లగ్జరీ. పొట్టకోస్తే అక్షరమ్ముక్క ఊడిపడ్డానికి సామాన్యుడిక్కడ గుండె కోసుకుని సంపాయించాలి. సక్రమంలోంచి అక్రమానికెళ్ళిపోవడాన్కి ఒక్కక్షరమే తేడా.

రెడ్ రోజ్, రెయిన్ డ్రాప్స్, లిటిల్ ఫింగర్స్ అంటూ ముద్దొచ్చేసే పేర్లున్న బళ్ళన్నీ గాలివెల్తురూ లేని జైలు గదుల్లా ఉంటాయి. కళ్ళు మూసుకుని గేమ్స్ ఫీజు కట్టాలి.

ముక్కు తుడుచుకోడంరాని మనవాడికి లైబ్రరీ ఫీజు కట్టాలి.

ఫస్టుకి ఫీజు కట్టడం తప్పిందో రోజుకి రెండు చొప్పున పెనాల్టీ లెక్కేసుకుని నోటీసు పోస్టులో వస్తుంది. పోస్టలు ఛార్జీ అయిదు రూపాయలు మాత్రమే.

బిల్డింగుకేమిటో మార్పు చెయ్యాలనో, ఫండ్స్ లేవనీ, జెండా ఎగరేస్తామనీ, దసరా వచ్చిందనీ, వార్షికోత్సవాలనీ, ఇంద్రజాలం అనీ వాళ్ళిష్టం. ఏ క్షణాన ఏ బాంబ్ వేసినా తలవంచడానికి రెడీగా ఉండాలి.



మరీ ముఖ్యంగా లాటరీ టిక్కెట్లుంటాయి. అవి పిల్లలెందుకు కొనాలో నాకర్థం కాదు. ఎంత కమీషన్ కోసమోగానీ వీటిని తలకొకటీ రెండూ చొప్పునమ్మలాగ్గా అమ్మేస్తాడు హెడ్మాస్టరు. రిక్షా దిగి ఇంటికి రావడం ఆలస్యం నీళ్ళూ పాలూ తాగడం మానేసి ప్రాణం తీసే కార్యక్రమంలో పడతారు పిల్లలు.

మమ్మీ ఫైవివ్వూ డాడీ టెన్నివ్వు అంటూ ఇల్లంతా దొర్లింతలే. ఎందుకురా అనండి.

పది లక్షలొస్తాయి ఇచ్చెయ్. ఇది వాడి సమాధానం. అంత డబ్బురాకపోవడం మూలంగా మీరుంటున్న అద్దెకొంప, రేడియో, పాతబడిన బీరువా అన్నీ పనికిమాలినవే అనే నిర్ణయానికొస్తాడు వాడు. అంతేకాదు డబ్బుతోనే సర్వం సిద్ధం అనేటువంటి భయంకరమైన పెద్దల జబ్బొకటి వీళ్ళకీ అంటుకుంటుంది.

'ఆఫీసరు గారమ్మాయి నీకేం ఖర్మ ఈ చాక్లెట్లేమిటి? లడ్డూబూందీ తేవాలి కాని' అందిట పుట్టిన్రోజుకి మా అమ్మాయితో వాళ్ళ టీచరెవరో. ఆవిడేదో సరదాగానే అందంటారా! ఇప్పుడిది ఆఫీసరు కాని వాళ్ళందరి అమ్మాయిలూ ఖర్మకాలిన వాళ్ళనే నిర్ణయానికొచ్చేసింది. అప్పర్ క్లాసూ లోయర్ క్లాసూ అంటూ మనుషుల్ని విడగొట్టడం నేర్చేసుకుంది తొమ్మిదేళ్ళొచ్చాలేని సాయం లేనిదే చీకట్లో ఒకటికి వెళ్ళలేని నా కూతురు. ముప్ఫయ్యేళ్ళొచ్చాక కూడా నాకు రాకూడని దుర్గుణాలన్నీ ఇప్పుడే దీనికొచ్చేశాయి.

'స్పీడంటే స్పీడు' అని సంబరపడమంటారా? అది నా వల్లకాదు.

నిలువుదోపిడీ ఇచ్చారా మీరెప్పుడన్నా? వంటి



మీద మొలతాడుతో సహా హుండీలో వేసెయ్యాల్ట. స్కూలు వాళ్ళు కూడా వాయిదా పద్ధతుల్లో చేయిస్తారా పని

వాన రావడంగానీ బస్సో రిక్షానో రాకపోవడంగానీ జరిగి పిల్లలు స్కూలుకి ఆలస్యంగా వెడితే ఫైన్. యూనిఫారం లేకపోతే ఫైన్. బూట్లేసుకోడం మర్చిపోతే ఫైన్, ప్రోగ్రెస్ కార్డ్ నలిగినా పారేసుకున్నా ఫైన్ అక్కడ మాత్రమే కొనకతప్పని పుస్తకాల పేరిట ప్రతిదానితోటీ అదనపు ఫైన్

ఎలాగండీ బతికేది?!

అయ్యలారా అమ్మలారా మామంచి విద్యామంత్రులారా పేకాటలూ గుర్రప్పందాలూ సీసాలూ అన్నీ మానేస్తాం ఒట్టు.

మా పిల్లలు బళ్ళోకెళ్ళి చదువుకుంటున్నా కూడా శాంతిగా అన్నం కూరా అధరువులతో ఆయుర్దాయం ఉన్నన్నాళ్ళూ నిలదొక్కుకునే ఏర్పాటేదో చెయ్యండి.

లేదా సరస్వతిని ద్వేషించడం నేర్పండి.

కొండేపూడి నిర్మల